కాంగ్రెస్‌కు నై.. కాసానికి జై



బీసీలపై వివక్షత చూపుతున్న కాంగ్రెస్ నేతలను నమ్మేది లేదు

బీసీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కే తమ మద్దతు అంటున్న బీసీ నేతలు

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీసీలు అధోగతిపాలవ్వడం ఖాయమని బీసీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. కాంగ్రెస్ హయాంలో బీసీలపై కొనసాగిన వివక్షతను ఈ సందర్భంగా బీసీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మారడం తప్పితే.. రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సాకుతో కాంగ్రెస్ నేతలు తమ అహంకారపూరిత మాటలతో బీసీల ఐక్యతను దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కులహంకారంతో మాట్లాడుతున్న నేతలకు వత్తాసు పలికితే రాబోయే రోజుల్లో బీసీ వర్గాలకు ఎదురయ్యే పరిస్థితులు ఇప్పుడే కండ్ల ముందర కదలాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో బీసీల సత్తా చూపిద్దామని పిలుపునిస్తున్నారు. బీసీల ఐక్యతకు కృషి చేస్తున్న బీసీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు బీసీలంతా మద్దతుగా నిలిచి గెలిపించుకుంటే బీసీలోని అన్ని కులాలకు సముచిత న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు. **- రంగారెడ్డి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ)**

బీసీ నేత గెలుపునకు కృషి చేయాలి

చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తాం. కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి బీసీల సత్తా చాటుతాం. ఎన్నికల సమయంలో బీసీలను పావులుగా వాడుకొని అధికారం దక్కించుకుంటున్న నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెబుతాం. అందుకు ప్రతి బీసీ బిడ్డ ఓ సైనికుడై బీసీ నాయకుడి గెలుపునకు కృషి చేయాలి.

-వెంకటేశ్ ముదిరాజ్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

అహంకారులకు ఓటుతో బుద్ధి చెప్పాలి

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బీసీలకు తగు న్యాయం చేసేందుకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు అధికంగా సీట్లు కేటాయించడం సంతోషంగా ఉన్నది. అగ్రకులాల నేతలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు. అహంకారంతో మాట్లాడే నాయకులకు ఓట్లతో బుద్ధి చెప్పాలి. బీసీలు ఐక్యతను చాటి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి.

- రాజు, నారాయణదాస్‌గూడ గ్రామం, చేవెళ్ల మండలం

బీసీలకు అండగా నిలువాలి..

చేవెళ్ల పార్లమెంట్‌లో బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న బీసీ నాయకుడు కాసాని జానేశ్వర్ ముదిరాజ్‌కు బీసీలందరూ మద్దతు తెలుపాలి. బీసీ అభ్యర్థిని గెలిపిస్తే పార్లమెంట్‌లో తమ సమస్యలు పరిష్కారమవుతాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి రెండుసార్లు రెడ్డీలకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే పార్టీలు మారారు. అలాంటి వ్యక్తులు మళ్లీ పోటీ చేస్తున్నారు. వారికి ఓటు ద్వారా బీసీలు బుద్ధి చెప్పాలి.

- ఆనేగౌని సంధ్యాదామోదర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ, కందుకూరు

కాసాని విజయం ఖాయం..

పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేస్తాం. బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపిస్తే పార్టీలు మారారు. రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిలను నమ్మి మోసపోవద్దు. కాసాని జానేశ్వర్ గెలుపు ఖాయం. కాంగ్రెస్, బీజేపీ నేతలు బీఆర్ఎస్ పార్టీపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో బీజేపీ ప్రజలను మోసం చేసింది. ఇంటింటికీ తిరిగి బీసీ నేత కాసాని విజయం కోసం కృషి చేస్తాం.

- సామ ప్రకాశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కందుకూరు

బీసీల ఓట్లే అధికం ..

బడుగు బలహీన వర్గాలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన సమయం వచ్చింది. ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నది. కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇచ్చి గౌరవించారు. కాంగ్రెస్ వక్రబుద్ధికి గుణపాఠం చెప్పాలి. బీసీల ఓట్లే అధికంగా ఉన్నాయి.

- అనిల్, బురాన్‌పల్లి, వికారాబాద్

బీసీలం మరింత బలపడుతాం ..

జనాభాలో బీసీల శాతం ఎక్కువగా ఉన్నా బీసీలకు సరైన న్యాయం జరుగడంలేదు. చేవెళ్ల గడ్డపై బీసీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటే బీసీలం మరింత బలపడుతాం. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తూ తక్కువ శాతం జనాభా ఉన్నవారు రాజ్యాధికారం చేపడుతున్నారు. ఈసారి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని బీసీల సత్తా చాటుదాం. **- అనిల్, వికారాబాద్**

బీసీల గళం వినిపించాలి

బీసీల గళం పార్లమెంటులో వినిపించేందుకు ఒక మంచి అవకాశం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కల్పించారు. చేవెళ్ల పార్లమెంటు జనరల్ స్థానంలో బడుగు వర్గాల గొంతుకగా, బీసీ కులాలన్నింటినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం సంతోషకరం. పార్లమెంటు పరిధిలోని మెజార్టీ బీసీ ఓటర్లు అభ్యర్థికి మద్దతు ప్రకటించాలి.

- పి.మాణిక్యం, మాజీ ఎంపీటీసీ, మిట్టకోడూర్, పరిగి మండలం

బీసీలు ఐక్యతను చాటాలి..

బీసీలంతా ఐకమత్యంతో ముందడుగు వేసి భవిష్యత్‌లో రాజకీయంగా రాణించాలి. మరింత ఐక్యతను చాటి పార్టీలకతీతంగా వెనుకబడిన వర్గాల అభ్యర్థులను బలపరచాలి. చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని బీసీ బిడ్డ కాసానికి బీఆర్ఎస్ ఇవ్వడం హర్షణీయం. ఇతర ఏ పార్టీలూ ఈ వర్గాన్ని గుర్తించలేదు. ఎన్నికల్లో బీసీలంతా బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసానిని అధిక మెజార్టీతో గెలిపించుకుని సత్తా చాటుదాం.

- జిల్లా గణేశ్, పద్మాశాలీ సంఘం నేత

తగిన గుణపాఠం చెప్పాలి

బీసీలంతా ఐక్యంగా ఉండి పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలి. బీసీలను హేళనగా మాట్లాడుతున్న వారికి తగు గుణపాఠం నేర్పాలి. రాజకీయాల్లో రాణించాలంటే బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి అండగా నిలువాలి. బీసీల ఐక్యతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలకు దీటుగా సమాధానం చెప్పాలి.

- ఎల్లం నాయుడు

బీసీల సత్తా చాటుదాం..

బీసీల ఓట్లను తమ నాయకుడికే వేసి బీసీల సత్తా చాటుదాం. బీసీలను తక్కువ చేసి మాట్లాడుతున్నవారికి ఓటుతో బుద్ధి చెబుతాం. బీసీలను గుర్తించి చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా బీసీల ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇవ్వడం చాలా సంతోషం. బీసీలకు బీఆర్ఎస్ నేత కేసీఆర్ రాజకీయాల్లో సముచితస్థానం కల్పించారు. బీసీలందరం ఏకమై బీసీ నాయకుడిని గెలిపించుకుందాం.

- అశోక్‌గౌడ్, పెద్దేముల్ గ్రామం

భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం..

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీ సామాజిక వర్గానికి ఎంపీ టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేశారు. కాసానిని గెలిపిస్తే సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుంది. బీసీ నాయకుడు కాసానికి ఓటు వేసి గెలిపించుకోవాలి.

- ఎద్ల రామచంద్రి, పెద్దేముల్ గ్రామం

కలిసికట్టుగా బీసీ నేతను గెలిపించాలి..

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి టికెట్‌ను బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు కేటాయించింది. ఇన్నాళ్లు అగ్రవర్గాలకు చెందిన నాయకుల గెలుపు కోసం బీసీ నేతలే అహర్నిశలు శ్రమించారు. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా బీసీ నాయకుడిని చేవెళ్ల గడ్డ నుంచి ఎంపీగా గెలిపించుకోవాలి. ప్రత్యేకంగా బీసీ నేతలు రాజకీయాలను పక్కనబెట్టి విజయమే లక్ష్యంగా పనిచేయాలి. ఐక్యతను చాటి విమర్శకులకు బుద్ధి చెప్పాలి.

- అంతారం నరేశ్‌కుమార్, అధ్యక్షుడు, బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ

కుల అహంకారంతో బీసీల్లో చిచ్చు

బడుగు బలహీనవర్గాలకు వచ్చిన అవకాశాలన్నీ గెలుపు దిశగా సాధించేందుకు ఐక్యతగా ముందుకు సాగాలి. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మోహన్‌రెడ్డి లాంటి నాయకులు చాలా గ్రామాల్లో తమ కుల అహంకారంతో బీసీల్లో చిచ్చు రేపుతూ ఓట్ల రాజకీయాలు చేస్తుండ్రు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలోని పల్లెల్లో అగ్రవర్గీయులు కులాల మధ్య గొడవలు సృష్టించి ఐక్యతను విచ్చిన్నం చేసేందుకు యత్నిస్తుండ్రు. ఇప్పుడు బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఓటు వేసి గెలిపించుకొని తమ బలాన్ని నిరూపించుకోవాలి.

- కుమార్, మణికొండ

బీసీలతోనే అన్ని వర్గాల సంక్షేమం..

పార్లమెంటు ఎన్నికల్లో బీసీలందరూ ఒకే వేదికగా నిలువాల్సిన అవశ్యకత ఏర్పడింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా బీసీల ఐక్యతపై కొందరు అసత్య ఆరోపణలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. బీసీలు పార్లమెంటులో అడుగుపెడితే మరింత అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం సాధ్యం. ప్రతిఒక్కరూ కంకణబద్ధులై పనిచేసి కాసాని జ్ఞానేశ్వర్ విజయానికి కృషి చేయాలి.

- ఆర్.శ్రీశైలం, పరిగి మండల బీసీ యువత ఉపాధ్యక్షుడు

ఏప్రిల్ 25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

వికారాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రేణుకాదేవి

వికారాబాద్, ఏప్రిల్ 23 : తెలంగాణ ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 25 నుంచి ప్రారంభం కానున్నట్లు వికారాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రేణుకాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతిలో 654 మంది, ఇంటర్మీడియట్‌కు 1095 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలకు సంబంధించి ఇంటర్మీడియట్‌కు 5 పరీక్షా కేంద్రాలు, పదో తరగతికి 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 9 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 9 మంది డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు 92 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. చిన్న తప్పిదం జరిగినా ఉపేక్షించేది లేదని, పరీక్షలు నియమ నిబంధనల ప్రకారం స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. వేసవికాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది ఉంటారన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఈవో సంబంధిత అధికారులకు సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు

షాబాద్, ఏప్రిల్ 23 : గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డిజిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ వారి ఆధ్వర్యంలో రంగారెడ్డిజిల్లా గ్రామీణ ప్రాంతాల్లో మే 1 నుంచి మే 31 వరకు 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు వివిధ గ్రామీణ క్రీడల్లో ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్‌ల నుంచి కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వార్షిక వేసవి శిక్షణా శిబిరం నిర్వహించినవారికి రూ.4వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. 10 ఉచిత గ్రామీణ వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించుటకు ఆసక్తి గల రంగారెడ్డిజిల్లాకు చెందిన అనుభవజ్ఞులైన సీనియర్ క్రీడాకారులు, జాతీయస్థాయి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు వారు నిర్వహించదలిచిన క్రీడాంశం, క్రీడా ప్రాంగణ ప్రదేశం, మొబైల్ నంబర్‌ను తెలియపరుస్తూ తమ దరఖాస్తులను ఏప్రిల్ 27 లోపు జిల్లా యువజన, క్రీడల కార్యాలయం, రంగారెడ్డి జిల్లా, ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్, ఎల్బీనగర్‌లో అందజేయాలని ఆయన కోరారు.

నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ చిత్రంలో కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

చేవెళ్ల లోక్‌సభకు 14 నామినేషన్లు

- నామినేషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

రంగారెడ్డి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ స్థానానికి మంగళవారం అభ్యర్థులు 14 నామినేషన్లను దాఖలు చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ 3వ, 4వ సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు అందజేశారు. దీంతోపాటు కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం రంజిత్ రెడ్డి, ఇప్పటికే నామినేషన్లు వేసిన ఎంసీపీఐ(యు)పార్టీ, బీఎల్ఎఫ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో వనం సుధాకర్ రెండో సెట్‌ను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా గోనె శ్రీనివాస్‌రెడ్డి, సప్తగిరి విశ్వకర్మ, ఉమేశ్ బోయ, మహ్మద్ పాషా, గోవింద్‌లాల్, మర్క సతీష్ సాగర్, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా బింగి రాములు, సోషల్ జస్టిస్ పార్టీ అభ్యర్థిగా ఫణిప్రసాద్ కటకం, బ్లూ ఇండియా అభ్యర్థిగా చింతలగారి వెంకటస్వామి ఒక్కొక్క సెట్ చొప్పున నామినేషన్లను దాఖలు చేశారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఇప్పటివరకు మొత్తం 37 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి శశాంక తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బాల్య వివాహాలు చేస్తే **వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

చట్టరీత్యా చర్యలు తప్పవు

సమీకృత కార్యాలయాల సమావేశం హాలులో శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో సమావేశం

వికారాబాద్, ఏప్రిల్ 23 : జిల్లాలో 18 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాలలోపు మగపిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం సమీకృత కార్యాలయాల సమావేశం హాలులో శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్, రెవెన్యూ, గ్రామపంచాయతీ దృష్టికి వచ్చిన బాల్య వివాహాలను ఆపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా డిపార్ట్‌మెంట్ కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు ఈ విషయంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే సంబంధిత శాఖలకు సమాచారమివ్వాలని, ఆడపిల్లలు ఎదుర్కొంటున్న విద్య, పోషకాహారం, బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం వంటి సమస్యలపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే వారి తల్లిదండ్రులపై, వారికి సహకరించిన, ప్రోత్సహించిన, పెళ్లి చేసుకున్న వరుడు శిక్షకు అర్హులన్నారు. కాలేజీలు, స్కూళ్లలో విద్యార్థులకు బాల్య వివాహాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వికారాబాద్ జిల్లాలో 2023లో బాల్య వివాహాలు 138 జరిగాయని, అడ్వాన్స్ టెక్నాలజీ ఉన్న రోజుల్లో కూడా ఇంకా బాల్య వివాహాలు జరగడమంటే మనం ఇంకా ఏ స్థాయిలో ఉన్నామో అర్థమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

బాల్య వివాహాలు ఆపేలా చర్యలు

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పద్మ మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నిర్మూలించడం సమాజంలో అందరి బాధ్యత కాబట్టి.. పెళ్లి అని ఎవరైనా వచ్చి పత్రిక ఇచ్చినట్లయితే వారిని వెంటనే వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. వయస్సు తక్కువగా ఉంటే పెళ్లిని ఆపేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జిల్లాలోని పూజారులు, పాస్టర్లు, ఖాజీలు, సఖి, డీసీపీయూ, సంబంధిత అధికారులున్నారు.

సమావేశానికి హాజరైన ఆయా శాఖల అధికారులు తదితరులు

లక్ష్యం మేరకు పనులు చేయాలి

జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో జాప్యం జరుగకుండా లేబర్ సమీకరణ చేస్తూ లక్ష్యం మేరకు ముందుకు వెళ్లాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. రోజుకు లక్షా యాభై వేల వరకు లేబర్ సమీకరణ జరగాలని.. ఎంపీడీవోలు, ఎంపీవోలు ప్రతి రోజూ గ్రామాలను పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లే రోడ్డు పనులు రైతులతో సమన్వయపరుచుకొని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో భూమి చదును చేయడం, ముండ్ల పొదలు తొలగించడం, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, వీధి లైట్లు, నర్సరీ, హరితహారం తదితర సమస్యలపై సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించేలా ముందుకెళ్లాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడేలా, గ్రామ స్థాయిలో పరిపాలనాపరంగా పనులు చేయాల్సిన బాధ్యత మీపై ఉందని అధికారులకు గుర్తు చేశారు. లేబర్ మొబిలైజేషన్ తక్కువ ఉన్న గ్రామాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పూర్తి చేసిన పనులన్నింటికీ ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి కొంతమేర జరిగిందని, ఇంకా కొన్ని గ్రామాల్లో పనులు జరగాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలాలవారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో ఫారాలను పెండింగ్ లేకుండా చూడాలి

ఓటరు జాబితాలో ఫారాలు – 6, 8 పెండింగ్‌లో లేకుండా చూడాలని, పార్లమెంట్ ఎన్నికల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు జాగ్రత్తగా ఫారాలను చెక్ చేసి పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫారం 12–డి క్లియర్ చేసి, మండల పరిధిలో ఏఆర్వోలు, తహసీల్దార్లు రిపోర్ట్ చెక్ చేసి పంపించాలన్నారు. ఎక్కడ కూడా ఎంసీసీ వాయలేషన్ ఉండరాదని, ఆథరైజ్డ్ వెహికిల్, లౌడ్ స్పీకర్‌లకు ఎప్పటికప్పుడు పర్మిషన్ ఇచ్చుకుంటూ మానిటర్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్నవారు ఫారం 12–డీలను, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి వంద శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 65,954 ఎపిక్ కార్డ్స్ వచ్చాయని, పోస్టల్ శాఖతో కోఆర్డినేట్ చేసుకుంటూ మూడు రోజుల్లో ఓటర్లకు అందేలా ఏఆర్వోలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి

తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో సమస్య రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట చేతిపంపులు, బోరు మోటర్లు, పైప్ లైన్ల మరమ్మతులు వంటివి సకాలంలో చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారనే మాటకు అస్కారం లేకుండా చూడాలన్నారు. మున్సిపల్, గ్రామాల పరిధిలో పక్షులు, పశువులకు నీటి తొట్టెల్లో నీటిని ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

బార్డర్ చెక్‌పోస్టు, స్ట్రాంగ్ రూంల పరిశీలన

ప్రత్యేక బలగాల సిబ్బందికి సలహాలు, సూచనలు అందిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

కొడంగల్, ఏప్రిల్ 23 : పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని మండలంలోని రావులపల్లి గ్రామ ప్రాంతంలోని తెలంగాణ–కర్ణాటక బార్డర్‌లో ఏర్పాటైన బార్డర్ చెక్‌పోస్టును జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. చెక్‌పోస్టు సిబ్బందితో వాహన తనిఖీలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కర్ణాటక నుంచి తెలంగాణకు వస్తున్న వాహనాలను పరిశీలించి, సిబ్బందికి భద్రతలపై పలు సూచనలు, సలహాలను అందించారు. బార్డర్‌పై కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో పాటు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గ్రామంలోని 259,260 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను సందర్శించి భద్రతా ఏర్పాట్ల పట్ల ఆరా తీశారు. స్ట్రాంగ్ రూం వద్ద కాపలా ఉన్న సిబ్బందితో మాట్లాడి భద్రతపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి ఓటర్ స్లిప్స్ పంపిణీ

- **284 పోలింగ్ కేంద్రాలు.. 26 మంది సెక్టోరల్ అధికారులు**
- **1,136 మంది సిబ్బందితో విధులు**
- **వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ**



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 23 : ఏప్రిల్ 25 నుంచి ఓటర్ స్లిప్స్ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ నియోజకవర్గ పరిధిలో పని చేసే సెక్టోరల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ఓటర్ స్లిప్ పంచడంతోపాటు ఓటర్ గైడ్‌ను కూడా అందించాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో బూత్ స్థాయి అధికారులు ఓటర్ స్లిప్పుల పంపిణీలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రతి ఓటర్‌కు అందేలా బాధ్యతగా పని చేయాలని సూచించారు. వికారాబాద్ నియోజకవర్గంలో పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి 284 పోలింగ్ కేంద్రాల్లో 1136 సిబ్బందితో విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా 26 మంది సెక్టోరల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు గ్రామాలు, మున్సిపాలిటీల్లోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసుకునేందుకు సన్నద్ధం కావాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు సమకూర్చుకోవాలని సూచించారు. వయోవృద్ధులు, దివ్యాంగ ఓటర్ల సదుపాయాల నిమిత్తం వీల్ చైర్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని చేరవేసేందుకు వీలుగా వాహనాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి జోసేఫ్‌కు ఆయన సూచించారు. సమీక్షా సమావేశంలో వికారాబాద్, బంట్వారం తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్ ఉన్నారు.

రూ.25లక్షలు పట్టివేత

ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ నం.12 వద్ద వాహనాల తనిఖీలు

పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

ఆదిబట్ల, ఏప్రిల్ 23 : ఎలాంటి పత్రాలు లేకుండా ఓ వాహనంలో ఇద్దరు వ్యక్తులు రూ.25,54,285లను ఆదిబట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. సోమవారం రాత్రి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగురోడ్డు వద్ద ఎగ్జిట్ నం.12 వద్ద తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో మలక్‌పేట్‌కు చెందిన మహ్మద్ ఇక్బాల్, ఇటికపల్లి గ్రామం, సంగారెడ్డికి చెందిన కిందొడ్డి సునీల్‌కుమార్ కలిసి టీఎస్11యూడీ4478 బొలెరో వాహనంలో ఎలాంటి పత్రాలు లేకుండా రూ. 25,54,285లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నగదుతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదును గ్రీవెన్స్ సెల్‌కు పంపించామని, దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.